క్లుప్తంగా

15లోగా దరఖాస్తు చేసుకోవాలి

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి, చింతగుర్తి గ్రామాల్లో మీ సేవా కేంద్రాలను నిర్వహించుటకు అర్హుల దగ్గర నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ విల్సన్‌బెన్నీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా మంజూరైన ఈ కేంద్రాల నిర్వహణకు ఈ నెల 11 నుంచి 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు తగిన ధ్రువీకరణ పత్రాలను కలెక్టర్ కార్యాలయంలోని ఏఓకి సమర్పించాలని సూచించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని బుద్ధారంలో ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామానికి చెందిన వివాహిత రమాదేవి(27) సోమవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. అయితే, కుటుంబ సభ్యులు గమనించి ఆమెను నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఫెలోషిప్ అభివృద్ధికి కృషి చేయాలి

రఘునాథపాలెం: ఫెలోషిప్ అభివృద్ధికి కృషి చేయాలని అధ్యక్షుడు అంతోటి జగన్ అన్నారు. సోమవారం రఘునాథపాలెంలోని ప్రిన్స్ ఆఫ్ లైఫ్ టెంపుల్‌లో నిర్వహించిన కింగ్స్ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పాస్టర్లు హనోక్, ప్రవీణ్, ఎలీషాలు ఫెలోషిప్ అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ సెక్రటరీ ప్రభుదాస్, ట్రెజరర్ ఆనందబాబు, వైస్ ప్రెసిడెంట్ ఫిలిప్‌రెడ్డి, కమిటీ సభ్యులు జాకబ్, నరేష్‌పాల్, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో మంజూరైన రూ.10 లక్షల విలువైన సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. కోడూరి సంగయ్య ఇంటి నుంచి తాళ్లూరి నాగరాజు ఇంటి వరకు, గుంటి శ్రీను ఇంటి నుంచి డబుల్ బెడ్‌రూం, మద్దాల బ్రహ్మయ్య ఇంటి వరకు రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి పూర్ణ, యండపల్లి సత్యం, మేళ్లచెర్వు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు అధికారులు సహకరించాలి

ఖమ్మంవన్‌టౌన్: ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ మాసం ప్రారంభమవుతున్న సందర్భంగా ముస్లింలకు జిల్లా అధికారులు సహకరించాలని జిల్లా మైనార్టీ నాయకుడు జిలానీ కోరారు. రంజాన్ మాసంలో ఉపవాసం (రోజా) పాటించడంతో పాటు రాత్రి వేళల్లో ప్రత్యేక నమాజ్ తరావి 11.30 గంటల వరకు ఉంటుందని ఆ సమయాన పెట్రోలింగ్ పోలీసులు సహకరించాలన్నారు. మసీదు పరిసరాలను శుభ్రంగా ఉంచి దోమలు లేకుండా నగరపాలక సంస్థ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రైవేట్ సంస్థలు, వ్యాపార సముదాయాలు, షాపింగ్ మాల్స్‌లో పనిచేసే వారికి నమాజ్ చేసుకునే వీలుతో పాటు ఇఫ్తార్ ఏర్పాట్లు వంటిని యాజమాన్యం కల్పించాలని ఆయన కోరారు.

రంజాన్ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: రంజాన్ ఉపవాసాలు, సహెరీ, ఇఫ్తార్ తదితర విశేషాల సమహారంతో గీటురాయి ముద్రించిన రంజాన్ ప్రత్యేక సంచికను సోమవారం ఖమ్మం అజీజ్‌గల్లీలోని జమాతే ఇస్లామీ హింద్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్ తెలంగాణ లీగల్ అఫైర్స్ కార్యదర్శి ఎండీ ఇల్యాస్ మాట్లాడుతూ.. రంజాన్ ఉపవాసాలు మనిషిలో ఎలాంటి మార్పు తీసుకొస్తాయో ఇందులోని వ్యాసాలు చక్కటి స్ఫూర్తిని నింపుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జైనుల్ పాషా, ఉపాధ్యక్షుడు అబ్దుల్ సమి, ఖిల్లా డివిజన్ అధ్యక్షుడు అబ్దుల్ మలిక్, మాజీ అధ్యక్షుడు ఖలీల్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	3
వంకాయ	46		20
బెండకాయ	40	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	40	చుక్కకూర	3
బీర	46		20
దొండ	24	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	100	గోంగూర	2
గోరుచిక్కుడు	46		10
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	25		20
ఆలుగడ్డ	30	కొత్తిమీర	1
చామగడ్డ	50		30
క్యారెట్	46	పుదీన	1
క్యాప్సికం	70		20

–ఖమ్మం వ్యవసాయం

కేఎంసీ కార్యాలయంలో బారులుదీరిన జనం



జీరో చేజారీ..!

కేఎంసీలో జీరో బిల్లు కోసం పాట్లు

- మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు బారులుదీరిన లబ్ధిదారులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్‌లోనే..
- 10కి పైగా కౌంటర్లు ఏర్పాటు చేసిన అధికారులు
- అసౌకర్యాలతో విసుగెత్తుతున్న లబ్ధిదారులు

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఒకటైన గృహ జ్యోతి పథకాన్ని ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభించినప్పటికీ.. వేల సంఖ్యలో లబ్ధిదారులు ఆ పథకాన్ని లబ్ధి పొందలేకపోయారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ఈ నెల ఆరంభం నుంచి కరెంట్ బిల్లులు తీస్తున్న సమయాన చాలమందికి జీరో బిల్లు రాకపోవడంతో ఆందోళన చెందారు. ప్రజాపాలనలో తాము దరఖాస్తు చేసుకున్నా.. బిల్లు రావడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు మరోసారి అర్హుల నుంచి గృహజ్యోతికి సంబంధించి దరఖాస్తులను తీసుకొని, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. అయితే గత వారం రోజులుగా కేఎంసీ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకుంటుండగా.. రోజురోజుకు దరఖాస్తులు అందించే లబ్ధిదారుల సంఖ్య భారీగా పెరుగుతోంది. గత వారంతో పోలిస్తే సోమవారం ఒక్క రోజే వేలాది మంది కేఎంసీ కార్యాలయానికి దరఖాస్తు సమర్పించేందుకు చేరుకున్నారు. ఇంత మంది కార్యాలయానికి రావడంతో ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారో.. లేదోనని ప్రజల్లో అనుమానం వ్యక్తమవుతోంది. పేరుకే తమ వద్ద ప్రజాపాలన దరఖాస్తులు తీసుకున్నారా..? లేక డేటా ఎంట్రీల్లో తప్పులు చేశారా అనే ప్రశ్నలు అధికారులను సందిస్తున్నారు.

ఒక్కరోజే 5వేలకు పైగా దరఖాస్తులు..

200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను పొందేందుకు జీరో బిల్లు రాని వారంతా కేఎంసీకి క్యూ కట్టారు. దీంతో అధికారులు కార్యాలయంలో 10కి పైగా కౌంటర్లను ఏర్పాటు చేసి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. సోమవారం ఉదయం అధికారులు, సిబ్బంది కార్యాలయానికి రాక ముందే 9 గంటల నుండే లబ్ధిదారులు క్యూ కట్టారు. 10.30 గంటల నుంచి సిబ్బంది దరఖాస్తులు తీసుకోవడం ప్రారంభించగా.. సాయంత్రం వరకు వందలాది మంది క్యూలైన్‌లోనే బారులుదీరి ఉన్నారు. సోమవారం ఒక్కరోజే 5 వేలకు పైగా లబ్ధిదారులు కార్యాలయానికి వచ్చి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో తప్పిదాలే కారణమా?

ఖమ్మం కార్పొరేషన్‌లో డివిజన్ల వారీగా ప్రజాపాలన నిర్వహించగా.. 1,00,736 దరఖాస్తులు వచ్చాయి. వాటిని వెంటనే కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్ చేయించారు. అవి ఆన్‌లైన్ చేసినా వేలాది మందికి ఈ నెల 1 నుంచి తీస్తున్న కరెంట్ బిల్లుల్లో కొందరికి జీరో బిల్లు రావడం, మరి కొందరికి జీరో బిల్లు రాకపోవడం పట్ల ఆందోళన చెందుతున్నారు. తమ దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారో.. లేదో? లేదా నమోదులో తప్పిదాలు జరిగాయా అని ప్రశ్నిస్తున్నారు. వేలాది మంది దరఖాస్తుల నమోదులో తప్పిదాలు జరగడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వలనే ఈ తప్పిదాలు జరిగాయనే ఆరోపణలు చేస్తున్నారు.

అసౌకర్యాలతో అసహనం..

వారం రోజులుగా గృహ జ్యోతి పథకం కోసం దరఖాస్తు చేసుకునేందుకు రోజుకు వందల సంఖ్యలో జనం కేఎంసీ కార్యాలయానికి వస్తున్నారు. దరఖాస్తు ఇచ్చేందుకు వచ్చిన వారికి సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరుసగా మూడు రోజుల సెలవుల తర్వాత సోమవారం వేలాది మంది కేఎంసీ కార్యాలయానికి దరఖాస్తులు ఇచ్చేందుకు రాగా.. ఒకే చోట ఐదారు కౌంటర్లు పెట్టడంతో జనమంతా ఒకేదగ్గర గుమ్మిగూడాల్సిన పరిస్థితి ఏర్పడగా.. వారిమధ్య వాగ్వాదాలు జరిగి ఒకరినొకరు నెట్టుకునే పరిస్థితికి వెళ్లింది. అయినా అధికారులు తమకేమి సంబంధం లేనట్లుగానే వ్యవహరించారే తప్ప.. ప్రజలను సముదాయించే ప్రయత్నం చేయలేదని అక్కడ ఉన్నవారు విమర్శలు చేశారు.



కౌంటర్ వద్ద ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ

హెల్ప్‌డెస్క్‌కు పోటెత్తిన జనం

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల వద్ద దరఖాస్తుదారులు పోటెత్తుతున్నారు. గృహలక్ష్మి, గ్యాస్ పథకంలో లబ్ధి కోసం, విద్యుత్ జీరో బిల్లు కొంతమందికే రావడంతో మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను ఆశ్రయిస్తున్నారు. కాగా రెండు కంప్యూటర్ల ద్వారా పనులు చేస్తున్నప్పటికీ సర్వర్ బీజీ కావడంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఎంపీడీఓ ఎం.యర్రయ్య మహిళలకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హెల్ప్ డెస్క్ నిరంతరం కొనసాగుతుందని, ప్రజలు ఆందోళన చెందనవసరం లేదని సూచించారు.



క్యూలో నిలబడిన ప్రజలు

చెరువులను సాగర్ నీటితో నింపాలి

తిరుమలాయపాలెం: సాగర్ జలాల ద్వారా పాలేరు చెరువు నింపి భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా మండలంలోని అన్ని చెరువులను నింపాలని, మిషన్ భగీరథ ద్వారా అన్ని గ్రామాలకు తాగు నీరు అందించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. యాసంగిలో వేసిన వరి పంటలు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఉన్నందున తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం సాగర్ జలాల ద్వారా నీటిని అందించాలని కోరారు. వర్షాలు లేక భూగర్భ జలాలు అరుగంటిపోయాయని, రానున్న వేసవిలో ప్రజలకు తాగునీరుకి ఇబ్బందిగా లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేశ్, డివిజన్ నాయకులు గొర్రెపాటి వీరస్వామి, పోలేపొంగు నాగయ్య, శ్రీనివాసరెడ్డి, సూరబోయిన మల్సూర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



డీటీకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

నేలకొండపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేసే కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి జి.రామయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వైద్యాధికారికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగాల్లో పని చేసే కార్మికులకు కనీస వేతనాలు చట్టం అమలు చేయాలని, ఔట్ సోర్సింగ్ కార్మికులకు రూ.21 వేల వేతనాలు అందించాలని, నెలకు నాలుగు సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలల నుంచి వేతనాలు అందించకపోవడం దారుణమన్నారు. ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా పాలేరు అధ్యక్షుడు, కార్యదర్శి పుల్లయ్య, పగిడికత్తుల రామదాసు, హీరాలాల్, ఆనంద్, సుజాత, కమలమ్మ, రవికుమార్, అనిత తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

మాదిగలపై కేసులు ఎత్తివేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: మాదిగ ఉద్యమకారులపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తి వేయాలని దళిత బంధు అవార్డు గ్రహీత, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం కమిషనరేట్ కార్యాలయంలో సీపీ సునిల్‌దత్‌ను మార్యద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దండోర ఉద్యమంలో 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసిన మాదిగ ఉద్యమకారులపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలన్నారు. ఆయన వెంట రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడిశాల వెంకన్న, జిల్లా అధికార ప్రతినిధి కోటేశ్వరావు, వీరస్వామి, ప్రకాశ్ బాబు, వెంకన్న, నరేశ్, మధు, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సీపీకి వినతి పత్రం ఇస్తున్న శ్రీనివాస్, తదితరులు

తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలి

తిరుమలాయపాలెం: అర్హులైన పేదలందరికీ తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పిండిప్రోలు గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహించే పథకాలలో తెల్లరేషన్ కార్డు తప్పనిసరి కావడంతో రేషన్ కార్డు రాని పేదలు ప్రభుత్వ పథకాలలో నష్టపోతున్నారన్నారు. కావునా రేషన్ కార్డు వచ్చే వరకు ఆరు గ్యారంటీల పథకాల్లో వాళ్ల కుటుంబంలో ఉన్న రేషన్ కార్డులను వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత పాలకులు తొమ్మిదేళ్ల నుంచి ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయనందున వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ ప్రభుత్వమైనా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు తుల్లూరి నాగేశ్వరరావు, సీపీఎం శాఖ కార్యదర్శి దొడ్డ లింగస్వామి, రామనబోయిన రవి, పప్పుల ప్రసాద్, పప్పుల ఉపేందర్, మడికంటి వెంకన్న, పంజా సైదులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొమ్ము శ్రీను

గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరణ



ఫిర్యాదును పరిశీలిస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో కమిషనర్ ఆదర్శ్ సురభి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈమేరకు ఫిర్యాదులను పరిశీలించి వాటిని ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. గత గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల వివరాలు, వాటి స్థితిని తెలుసుకుని, పరిష్కారం కానివాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, ఆర్‌ఓ శ్రీనివాసరావు, ఆర్‌ఐ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఎదుట సీపీఎం నాయకుల ధర్నా

ఖమ్మంమయూరిసెంటర్/ నేలకొండపల్లి: ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను ఎస్‌బీఐ అధికారులు తక్షణమే బహిర్గతం చేయాలని సీపీఎం ఆధ్వర్యాన బ్యాంక్ ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్‌బీఐ పాటించాల్సిందేనంటూ సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ అధ్యక్షతన ఖమ్మంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. అలాగే నేలకొండపల్లిలో పార్టీ కార్యాలయం నుంచి బ్యాంక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్‌లతో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, సుప్రీంకోర్టు చెప్పిన విధంగా ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని అన్నారు. మోదీ ప్రభుత్వానికి తలొగ్గి బాండ్ల వివరాలు వెల్లడించకుండా నాంచాలని ఎస్‌బీఐ చూస్తుందని, రాజ్యాంగ విరుద్ధంగా చేస్తున్న ఎన్నికల బాండ్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. పబ్లిక్ బ్యాంక్‌ను బీజేపీ బ్యాంక్‌గా మార్చొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాచర్ల భారతి, సీహెచ్.కోటేశ్వరరావు, మాధినేని రమేష్, మెరుగు సత్యనారాయణ, నందిపాటి మనోహర్, గుడవర్తి నాగేశ్వరరావు, రచ్చా నరసింహారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, కట్టికోల వెంకన్న, మారుతి కొండలరావు, మందడపు మురళీకృష్ణ, దేగల వెంకటేశ్వర్లు, ఎంఏ జబ్బార్, బషీరుద్దీన్, ఆర్.ప్రకాష్, నవీన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




ఖమ్మంమయూరిసెంటర్: బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/కామేపల్లి: ఖమ్మం నగరంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ వీడీఓస్ కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏఈ ఆపరేషన్స్ బి.తావుర్యా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో గట్టయ్యసెంటర్, వీడీఓస్ కాలనీ, బ్యాంక్ కాలనీలో విద్యుత్ ఉండదన్నారు. అలాగే కామేపల్లి మండలం కొత్తలింగాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పాతలింగాల ఫీడర్‌లోని పాతలింగాల, కొత్తలింగాల, పింజరమడుగు, బద్దుతండా గ్రామాలకు మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలన్నారు.

16, 17న ఆర్టీసీ ఈయూ మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ నెల 16,17 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే ఆర్టీసీ ఈయూ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర నాయకుడు తిమ్మినేని రామారావు పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. ఆర్టీసీలోని అన్నివిభాగాల సిబ్బంది సమస్యలను ఈ మహాసభలో చర్చించనుండగా.. ఈ సభలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వెంకటరెడ్డి, అప్పారావు, మోహన్‌రావు, తోట రామాంజనేయులు, జీ.కే.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘హార్వెస్ట్’కు రాష్ట్రస్థాయి ర్యాంక్



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: డాక్టర్ ఏ.ఎస్.రావు అవార్డు కౌన్సిల్ హైదరాబాద్ నిర్వహించిన 33వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. సోమవారం కళాశాలలో విద్యార్థులను అభినందించిన సందర్భంగా వారు మాట్లాడారు. పదో తరగతి విద్యార్థిని ధాత్రిజ 3వ ర్యాంక్, టి.రేవంత్‌కుమార్ 4వ ర్యాంక్, కె.హర్షిత్, సీహెచ్.కృష్ణమాదూర్ 6వ ర్యాంక్, పి.అన్విదారెడ్డి, ఎం.శరత్‌చంద్రలు 10వ ర్యాంకులు సాధించారన్నారు. ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ చైతన్యోత్సవ-24 పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్‌లో గల శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 21, 22న జరిగే జాతీయస్థాయి టెక్నికల్ అండ్ కల్చరల్ ఫెస్ట్ శ్రీచైతన్య-24కి సంబంధించిన పోస్టర్లను సోమవారం కళాశాల డైరెక్టర్ సాయిగీతిక, చైర్మన్ మల్లంపాటి శ్రీధర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీవిద్య, శ్రీధర్‌లు మాట్లాడుతూ.. సమాజసేవ కోసం బ్లడ్ డొనేషన్, అనాథాశ్రమాల సందర్శన, ఓట్ ఫర్ ఎవ్రీవన్ అనే అంశంపై టూకే రన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు పలువురిని ఆకర్షించాయి. ప్రిన్సిపాల్ పి. కృష్ణమూర్తి,, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

‘గీతాంజలి’ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: సీవీ రామన్ టాలెంట్ టెస్ట్‌లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారని గీతాంజలి పాఠశాల కరస్పాండెంట్ టీవీ అప్పారావు, డైరెక్టర్లు టి.పద్మ, టి.అరుణ్‌లు తెలిపారు. సోమవారం పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించిన సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో జి.ఈశ్వర ప్రకాశ్ 3వ ర్యాంక్, కె.విశ్వక్ తేజ 4వ ర్యాంక్, ఆర్.భువన ఆదర్శ్ 5వ ర్యాంక్ సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

‘ఎస్‌బీఐటీ’కి న్యాక్ ఏ ప్లస్ గుర్తింపు



కేక్ కట్ చేస్తున్న కళాశాల చైర్మన్, తదితరులు

ఖమ్మం సహకారనగర్: తమ కళాశాలకు జాతీయ స్థాయిలో ప్రమాణాలకు గుర్తింపుగా ఇచ్చే నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) ఏ ప్లస్ గుర్తింపు లభించినట్లు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. సోమవారం గతంలో ఉన్న బీ ప్లస్ నుంచి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించిన మొట్ట మొదటి ఇంజనీరింగ్ కళాశాల తమ కళాశాల అని చెప్పారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, జె.రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ అమిత్ బిందాజ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో మహిళా దినోత్సవం

ఖమ్మంవ్యవసాయం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ)లో పనిచేసే మహిళా అధికారులు, ఉద్యోగులను శాలువాలు కప్పి సత్కరించారు. మార్చి 8వ తేదీ సెలవు దినం కావడంతో సోమవారం బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, బ్యాంక్ అభివృద్ధిలో మహిళల పాత్ర కూడా ఉందని పేర్కొంటూ పలువురిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి అబీద్ ఉర్ రెహమాన్, డైరెక్టర్ పునుకొల్లు రాంబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన మహిళా అధికారులు, ఉద్యోగులతో బ్యాంక్ అధికారులు